క్లుప్తంగా

సివిల్ సప్లై అధికారిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బాలానగర్: బాలానగర్ సివిల్ సప్లై అధికారి గంపా శ్రీనివాస్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి

మోతీనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన సోమవారం హరినగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న సాయంత్రం 6 గంటలకు పర్వత్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో సన్నాహక సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడానికి మాదిగ బిడ్డలు పెత్త ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం 14 మందికి మొత్తం 7 లక్షల35 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికి 5వేల మందికి పైగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందజేశామన్నారు. గతంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధి పొందాలంటే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆపద ఉంది అంటే నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారని తెలిపారు.

హైదర్‌నగర్ స్కూల్ కూలిపోయే ప్రమాదం ఉంది

- కొత్త భవనం నిర్మించాలని జిల్లా అదనపు కలెక్టర్, డీఈఓకు వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కూకట్‌పల్లి మండలంలోని హైదర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందని.. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఈవో విజయకుమారికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ హైదర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించి దాదాపు 55 ఏళ్లు గడుస్తోందన్నారు.వర్షం వస్తే బిల్డింగ్ ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు భయంతో గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు.



గిఫ్ట్ ఏ స్మైల్ కింద బీఆర్ఎస్ ఐటీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ సమక్షంలో రూ.10వేల చెక్కును అందజేస్తున్న పునీత

మళ్లీ తొలిమెట్టు..!

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా కార్యాచరణ
- 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ
- బేస్‌లైన్ పరీక్షతో సామర్థ్యం అంచనా వేస్తున్న విద్యాశాఖ
- తదనుగుణంగా తొలిమెట్టుపై ప్రత్యేక చర్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం, గణితంలో నాలుగు ప్రక్రియలకు సంబంధించిన లెక్కలు చేసేలా కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు గతేడాది పాఠశాల విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించి ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ –19 కారణంగా బడుల్లో చదువులు ఆగిపోవడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం తగ్గింది. తిరిగి సామర్థ్యం పెంపొందించేలా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేసింది. ఈ కార్యక్రమం అమలుతో గతేడాది చాలా వరకు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటారు. అందుకే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కొనసాగించేందుకు ఎస్సీఈఆర్టీ నిర్ణయించింది. సక్రమంగా అమలు చేసేందుకు మరోసారి ఉపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించింది.

మూడు విడతల్లో శిక్షణ

గత విద్యా సంవత్సరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇచ్చి ఆగస్టు 15 నుంచి అమలు చేశారు. భాషా, గణిత సామర్థ్యాల సాధనకు శ్రీకారం చుట్టి విద్యా సంవత్సరం ముగిసే వరకు అమలు చేశారు. విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం బోధనాభ్యసన కార్యక్రమాలను రూపొందించి పక్కాగా అమలు చేశారు.

ప్రారంభ పరీక్షతో అంచనా

తొలిమెట్టు అమలులో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న 2వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించి అభ్యసన సామర్థ్యాల స్థాయిని అంచనా వేశారు. ఎస్సీఈఆర్టీ గతేడాది రూపొందించిన ప్రశ్నపత్రాలతో ప్రారంభ పరీక్ష నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు కనబర్చిన సామర్థ్యాల ఆధారంగా అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

26 వరకు జిల్లాస్థాయిలో శిక్షణ

తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు మళ్లీ శిక్షణ ఇచ్చేందుకు ఎస్సీఈఆర్టీ కార్యాచరణ రూపొందించింది. 1 నుంచి 5 తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణితంలో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు వంతున ఆరుగురిని ఎంపిక చేసి ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. వీరి శిక్షణ ముగిసిన తర్వాత మండల స్థాయిలో ఈ నెల 28 నుంచి ఒక్కో సబ్జెక్టుకు రెండు రోజులు వంతున శిక్షణ ఇవ్వనున్నారు.

సత్ఫలితాలు సాధిస్తాం

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండేలా అమలు చేస్తున్న తొలిమెట్టు సత్ఫలితాలనిచ్చింది. రెండో విడతగా ఈ ఏడాది అమలు చేసి ఉత్తమ ఫలితాలను సాధించేందుకు శ్రద్ధ తీసుకుంటాం. ఈ నెల 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

బీజేపీ నేతల అరెస్టు హేయమైన చర్య



కేపీహెచ్‌బీ ఠాణా ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి బీజేపీ కార్యవర్గ సభ్యుడు శరణ్ చౌదరి, ప్రీతంరెడ్డి సోమవారం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీసులు వీరిని అరెస్టు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. శాంతియుతంగా ఎటువంటి హడావుడి లేకుండా వినతిపత్రాలు స్వీకరిస్తున్న వారిపై, మహిళలపై దురుసుగా ప్రవర్తించడంతో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం నాయకులను అరెస్టు చేసి కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారిని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావులు పరామర్శించి వారికి మద్దతు తెలిపారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఆశ చూపి నేటికి వాటిని అర్హులకు అందించలేదన్నారు. కొన్ని చోట్ల ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని పేర్కొన్నారు. కావాలనే ఎన్నికల వరకు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం జాబితా తయారు చేస్తుంటే ఆ క్రెడిట్ బీజేపీకి ఎక్కడ దక్కుతుందో అన్న ఉద్దేశంతోనే పోలీసులతో అరెస్టు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు గందం రాజు, సీనియర్ నాయకులు సాధు ప్రతాప్‌రెడ్డి, మైనార్టీ మోర్చా నాయకులు మగ్దూం, కేదార్ మాణిక్, గురుప్రసాద్, రఘురాం, చిన్న, హుస్సేన్, రేవతి, నాగలక్ష్మి, సులోచన, వరలక్ష్మి, సుగుణమ్మ తదితరుల పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా సతీష్‌కుమార్

ఆల్విన్‌కాలనీ: లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా పర్వత సతీష్ కుమార్ పటేల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఈనాడు కాలనీ సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇంటర్‌నేషనల్ లయన్స్ క్లబ్ సంస్థ ద్వారా సభ్యుడిగా ఎన్నికయ్యాక తాను చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. క్లబ్ ఆఫ్ సనత్‌నగర్ టీమ్‌కు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో లయన్ ఓబుల్ రెడ్డి, పుల్లారెడ్డి, ప్రపుల్లా రెడడ్డి, షేక్ మున్నీర్ భాషా, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్వత సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

డబుల్ 'ఇళ్ల' దరఖాస్తుదారులకు పరిష్కారం చూపుతాం

మాధవరం కాంతారావు

బాలానగర్: తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం పథకాన్ని ఎన్నికల హామీగా ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ గద్దెనెక్కి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఈ నెల 26న ధర్నా చౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాలానగర్ డివిజన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేస్తున్న లబ్దిదారులను కలిసి వారి వద్ద నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. లబ్దిదారులకు తప్పకుండా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందమైన అబద్దాలు చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చ లేదో సమాధానం చెప్పాలన్నారు. మోదీ ప్రభుత్వం 2016లో రాష్ట్రానికి 2.91 లక్షల ఇళ్లు కేటాయించి, ఇందుకు గాను 1311.49 కోట్లు ఇచ్చిందని తెలిపారు. 8624.76 కోట్ల రుణాన్ని సమకూర్చిందని తెలిపారు. ఎన్నికల్లో 20 వేల కోట్లతో మూడు లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించిన కేసీఆర్ ప్రభుత్వం 20 వేల ఇళ్లు కూడా లబ్దిదారులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీజేపీ నిర్వహించనున్న మహాధర్నాకు డబుల్ బెడ్‌రూం ఇళ్లకై దరఖాస్తు చేసుకున్న వారందరు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సురేందర్, లక్ష్మణ్, శివ రంజని, మధు తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో డబుల్ ఇళ్ల లబ్ధిదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కాంతారావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వసంత్‌నగర్ సెక్షన్ ఏఈ సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. 6వ ఫేజు ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ ప్రాంతం, పాత 6వ ఫేజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పాత 6వ ఫేజ్ ప్రాంతంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కూకట్‌పల్లి ఏసీపీగా పెద్దారెడ్డి శివభాస్కర్



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ నూతన ఏసీపీగా పెద్దారెడ్డి శివభాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ చంద్రశేఖర్ అబిడ్స్‌కు బదిలీపై వెళ్లారు. సైబరాబాద్ ఆఫీస్‌లో పనిచేసిన శివభాస్కర్ కూకట్‌పల్లికి వచ్చారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన, కూకట్‌పల్లి సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్ల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రియాంకాగాంధీ పర్యటన గురించి చర్చించి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు పుష్పారెడ్డి, ఏ బ్లాక్‌అధ్యక్షురాలు రమాదేవి, బీ–బ్లాక్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, రజిత, మారుతి, భారతమ్మ, బోజమ్మ, జ్యోతి, విజయలక్ష్మి, రేణుక, కృష్ణ వేణి, రాధ, వరలక్ష్మి, సంధ్య, రేష్మ, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మహిళా నాయకులతో సమావేశమైన లక్ష్మి, గొట్టిముక్కల వెంగళరావు

డిఫెన్స్ లిక్కర్ స్వాధీనం

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు
- డిఫెన్స్ ఉద్యోగి మద్యం సరఫరా చేస్తున్నట్లు వెల్లడి

బాలానగర్: మిలిటరీ మద్యం అమ్మినా.. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి అమ్మినా.. నేరమేనని ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జోన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య అన్నారు. సోమవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ మీదుగా హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలు దిగి వస్తున్న వ్యక్తిని సోదా చేయగా 63 మద్యం బాటిల్స్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన డిఫెన్స్ లిక్కర్ బాటిల్స్ దొరికాయి. వాటితో పాటు రసూల్‌పురాకు చెందిన అన్నపురెడ్డి కృష్ణారెడ్డి (36)ని, అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (40) అన్నదమ్ములను విచారించగా కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంకు చెందిన సచిన్ అనే డిఫెన్స్ ఉద్యోగి మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

◆ అనంతరం రసూల్‌పురాలోని శ్రీనివాస్‌రెడ్డి నివాసాన్ని సోదా చేయగా మరికొన్ని మద్యం బాటిళ్లు దొరికాయని, మొత్తం 95 మద్యం బాటిళ్లను స్వాధీంచేసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 309 కేసులు నమోదు చేసి 136 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరి నుంచి 85 కిలోల గంజాయి, 2600 లీటర్ల సుంకం చెల్లించని మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా విమానాశ్రయం, బస్సులు, రైల్వే స్టేషన్‌లలో ఎక్సైజ్ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్‌వైజర్ జీవన్‌కిరణ్, సీఐ ఆర్.శ్రీధర్, ఎస్ఐలు కూర్మయ్యనాయుడు, విష్ణుగౌడ్, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్స్ కిషన్, రవి, సుధాకర్, పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఘనంగా షటిల్ బాడ్మింటన్ క్రీడోత్సవం



క్రీడోత్సావాల్లో పాల్గొన్న ప్రేమ్‌కుమార్, పన్నాల హరీష్‌రెడ్డి, కల్నల్ సుదర్శన్

కూకట్‌పల్లి: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టీ ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ క్రీడలను ప్రోత్సహించేందుకు షటిల్ బాడ్మింటన్ క్రీడోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాతకు జై నినాదాలతో స్టేడియాన్ని హోరెత్తించారు. మెన్స్ సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కల్నల్ సుదర్శన్ నగదు బహుమతిని అందించారు. గతంలో తాను పాల్గొన్న యుద్ధాల అనుభవాలను క్రీడాకారులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల సమస్యలను అడిగి తెలుసుకొని ఎప్పుడైనా తనని సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వారికి మెమొంటోలు అందించారు. ఈ షటిల్ టోర్నమెంట్ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులు ఆకుల రాము, యోగేష్, దివ్యదత్తలను, క్రీడాకారులను అభినందించారు.

శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: మూసాపేట డిప్యూటీ కమిషనర్ రమేష్‌ను తెలంగాణ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవాన్ యాదగిరి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిరు నీలం, ప్రధాన కార్యదర్శి షేక్ అష్రాఫ్, సహ అధ్యక్షుడు సాయి కుమార్, సర్కిల్ అధ్యక్షుడు పగుడాల వెంకటేష్, సుభాష్‌గౌడ్, నాయకులు లక్ష్మీపవన్, రాములు, మల్లికార్జున్, సుభాష్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరం యువత రాజకీయాల్లోకి రావాలి

- వాట్ ఇజ్ మై గోల్ అండర్– 18 వరల్డ్ కార్యక్రమం
- యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించాలని కోరుతున్నాం
- నిర్మాత శోభు యార్లగడ్డ, టీసీఐఓ డా. శాంతాతౌటమ్





జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన వాట్ ఇజ్ మై గోల్ అండర్–18 వరల్డ్ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మాత శోభు యార్లగడ్డ, డాక్టర్ శాంతా తౌటమ్ తదితరులు, పాల్గొన్న విద్యార్థులు

బాలానగర్: విద్యార్థులు వారు కోరుకున్న వృత్తిలో స్థిరపడడానికి, ఊహించిన భవిష్యత్తులో జీవించేలా సాధికారత కల్పించేందుకు ప్రముఖ స్టార్టప్ కంపెనీ వాట్ ఇజ్ మై గోల్ అండర్–18 వరల్డ్ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూహెచ్‌లో సోమవారం నిర్వహించింది. విద్యార్థులే ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల పాత్రలను పోషించారు. నిజ జీవితంలో విద్యార్థులకు పరిపాలన, ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు నేటి తరం రాజకీయాల్లో పాల్గొనాలని, విద్యాధికులు రాజకీయాల్లోకి వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ప్రముఖ నిర్మాత శోభు యార్లగడ్డ, తెలంగాణ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (టీసీఐఓ) డాక్టర్ శాంతా తౌటమ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పనితీరు, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలను లోతుగా తెలుసుకునేందుకు విద్యార్థులకు ఈ కార్యక్రమం గొప్ప అవకాశాన్ని కల్పించింది. కొందరు విద్యార్థులు ఎన్నికల అధికారుల పాత్రలను పోషించారు.

మూవీ మేకర్స్ క్లాస్ ప్రారంభం..

◆ బాహుబలి నిర్మాత యార్లగడ్డ శోభు మాట్లాడుతూ.. సినిమారంగం, ప్రొడ్యూసింగ్ సంబంధిత అంశాలపై విలువైన సమాచారాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సినిమా ప్రపంచంలోని యువత ప్రతిభను ప్రోత్సహించే వేదిక అయిన మూవీ మేకర్స్ క్లాస్‌ను ఆయన ప్రారంభించారు.

◆ అనంతరం డాక్టర్ శాంతి తౌటమ్ మాట్లాడుతూ.. ఆవిష్కరణ అనేది దేశ పురోగతికి చోదక శక్తి, ఇన్నోవేటర్స్ క్లాస్ ద్వారా సమాజాన్ని సానుకూలంగా మార్చడంలో దారితీసే యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనిధి, లేహ్య, సాన్వి పాల్గొన్నారు. ఈ ముగ్గురూ వాట్ ఇజ్ మై గోల్‌లో బిజినెస్ రాక్‌స్టార్ ప్రోగ్రాంలో పూర్వ విద్యార్థులు కావటం విశేషం.

కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష

మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దేశ రాజకీయాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక పాత్ర పోషిస్తారని.. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకాంక్షించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురష్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లిలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం 2వేల మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. పుట్టిన నాటి నుంచి వెన్నుముక వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ. 65 వేల విలువ గల వీల్ చైర్‌ను అందించి చిన్నారి కుటుంబంలో ఆనందం నింపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కేటీఆర్ పుట్టిన రోజు దుప్పట్లు, చీరల పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఈరోజు ఏకంగా 2వేల మంది మహిళలకు చీరలను పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, బల్వంత్‌రెడ్డి, కర్రె జంగయ్య, కర్రె లావణ్య తదితరులు పాల్గొన్నారు.





కేక్ కట్ చేసి చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్